సాక్షి
వికారాబాద్

శనివారం । 2 । డిసెంబర్ । 2023



ఓటు.. గ్రేటు

కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట మండలంలో 80.93 శాతం పోలింగ్ నమోదైంది. 8లో▸



గప్‌చుప్

ఎన్నికల హడావుడి, ప్రచారాల హోరుతో సందడిగా ఉన్న గ్రామాల్లో పోలింగ్ అనంతరం ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవహించింది. 8లో▸



మకాం మార్చిన నేతలు!

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కళకళలాడిన ఆయా పార్టీల అభ్యర్థుల నివాసాలు ప్రస్తుతం బోసిపోయాయి. 9లో▸

న్యూస్‌రీల్

ఓటు వేసేందుకు వచ్చి..

స్కూటీని ఢీకొన్న లారీ

వ్యక్తి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

పరిగి: ఎదురుగా వస్తున్న స్కూటీని లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట్ గేట్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. దుద్యాల మండలం సాగరం తండాకు చెందిన దంపతులు మోహన్‌నాయక్(42), లక్ష్మీబాయి నగరంలో ఉంటున్నారు. గురువారం ఓటు వేసేందుకు గ్రామానికి వచ్చారు. ఓటు వేసి శుక్రవారం తమ కూతురు కీర్తిబాయితో కలసి స్కూటీపై నగరానికి బయలుదేరారు. మార్గమధ్యలో రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ స్కూటీని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మోహన్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మీబాయి, కీర్తిబాయికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నగరానికి తరలించారు. మృతుడి కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొడంగల్‌కు రాతి శిల్పాలు



కొడంగల్: పట్టణంలోని శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం కోసం తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి నుంచి రాతి శిల్పాలు శుక్రవారం వచ్చాయి. వాటికి మాలధారులు పూజలు చేసి క్రేన్ సాయంతో కిందకు దింపారు. అయ్యప్ప సేవా సమితి, ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్రాయాదవ్, ఉమాపతి గౌడ్, కానుకుర్తి నర్సిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కిషన్ ఢాగ, జగదీశ్ కుమార్ తదితరులు ఆలయం వద్ద శిల్పాలను పరిశీలించారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

బోగస్ ఓట్లు వేయించిన వ్యక్తుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

నాంపల్లి: బోగస్ ఓట్లు వేయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. టాస్క్‌ఫోర్స్, స్థానిక హబీబ్‌నగర్ పోలీసు దాడిలో వారి నుంచి 67 డూప్లికేట్ ఓటరు గుర్తింపు కార్డులు, రెండు థిన్నర్ డబ్బాలు, ఓటరు జాబితా, మూడు సెల్ ఫోన్లు, దూది(కాటన్), ఒక స్లిప్ ప్రింటింగ్ మిషన్, రెండు పేపర్ రోల్స్, వ్యాజిలిన్ డబ్బాలు తదితరాలను స్వాధీనచేసుకున్నారు. శుక్రవారం సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ బి.బాలస్వామి, టాస్క్‌ఫోర్స్ డీసీపీ నితికాతో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 30న జరిగిన ఎన్నికల్లో తమ పార్టీకి చెందిన అభ్యర్థి గెలిపించేందుకు నాంపల్లికి చెందిన మహ్మద్ జాకీర్, మహ్మద్ షాబుద్దీన్, విజయ్‌నగర్ కాలనీకి చెందిన రితేష్ గుప్తా నగరాన్ని వదిలిపెట్టిన వారు, చనిపోయిన వారు, ఓటింగ్‌కు దూరంగా ఉన్న ఓటర్లను గుర్తించి వారి పేరిట ప్రత్యేక గుర్తింపు కార్డులను తయారు చేశారు. ఓటరు జాబితాను దగ్గర పెట్టుకుని స్లిప్పులు ఇస్తూ కొందరు వ్యక్తులను పోలింగ్ స్టేషన్ 123లో ఓట్లు వేయిస్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను పట్టుకున్న సిబ్బందిని డీసీపీ అభినందించారు. నిందితులు ముగ్గురు సభ్యులు ఎంఐఎంకు చెందిన వ్యక్తులుగా గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు, టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గెలుపోటములపై చర్చోపచర్చలు

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడనున్న నేపథ్యంలో నగరంలో ఏ నియోజకవర్గంలో ఎవరు గెలవనున్నారనే అంశంపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఎక్కడ ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ జరుగుతోంది. పోలింగ్ ముగియగానే వెలువరించిన ఎగ్జిట్ పోల్ ఫలితాలతో అవే రకమైన ఫలితాలు వెలువడవచ్చుననే వారితో పాటు ఎగ్జిట్ ఫలితాలన్నీ వాస్తవాలు కావని, తేడా ఉంటుందని వాదిస్తున్న వారూ ఉన్నారు.

ఎవరి లెక్కలు వారివే..



పరిగి: స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేసిన కలెక్టర్, అధికారుల బృందం

ఈవీఎంలలో నేతల భవితవ్యం

- పైకి ధీమా.. లోపల గుబులు
- పార్టీల వారీగా సమీక్షలు
- ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంలో అధికార పార్టీ అభ్యర్థుల్లో ఆందోళన
- ఆనందంలో కాంగ్రెస్ శ్రేణులు

వికారాబాద్: రెండు నెలలుగా హోరాహోరీగా సాగిన ప్రచారం పోలింగ్ ప్రక్రియతో ఎన్నికలు ముగిశాయి. నేతల భవితవ్యం ఈవీఎం యంత్రాల్లో నిక్షిప్తమైంది. పోలింగ్ ముగియడంతో అన్ని పార్టీలు గెలుపోటములపై లెక్కలు వేసుకునే పనిలో పడ్డాయి. గత ఎన్నికలతో పోలిస్తే కొన్ని చోట్ల ఓటింగ్ శాతం పెరగడంతో ఈ ప్రభావం ఎవరికి లాభిస్తుందోననే అంచనాలు వేసుకుంటున్నారు. మండలాలు, గ్రామాల వారీగా పోలింగ్ సరళిపై పార్టీల అభ్యర్థులు శుక్రవారం సమీక్షలు నిర్వహించినట్లు సమాచారం. ఓటింగ్ సరళిని బట్టి ఏయే మండలాల్లో లీడ్ వస్తుంది.. ఎక్కడ వెనుకబడి పోతున్నామనే విషయాలపై సమీక్షించినట్లు సమాచారం. అయితే ఎగ్జిట్‌పోల్స్ అంచనాల నేపథ్యంలో అధికార పార్టీ నేతలు కొంత ఆందోళనకు గురవుతున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఏకంగా స్వీట్లు పంచుకుంటున్నారు. గతంలో మాదిరిగానే ఈ సారి కూడా ట్రాన్స్ జెండర్లు ఎక్కువ శాతం మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. జిల్లాలో మొత్తం 40 మంది ట్రాన్స్ జెండర్లు ఉండగా 8మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల ఓటింగ్ శాతంతో పోలిస్తే మహిళల ఓటింగ్ శాతం కాస్త తక్కువగా నమోదైంది.

ఎవరి ధీమా వారిదే

జిల్లాలో వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఆదివారం నేత భవితవ్యం తేలనుండగా ఓటింగ్ సరళిపై పలు పార్టీల అభ్యర్థులు లెక్కలు వేసుకునే పనిలో పడ్డారు. తామే గెలుస్తామంటే తామే గెలుస్తామని అన్ని పార్టీల అభ్యర్థులు ధీమాతో ఉన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే కొడంగల్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం బాగా పెరిగింది. పెరిగిన ఓటింగ్ సరళి ఎవరికి లాభిస్తుందోననే కోణంలో కూడా ఫలితాలను అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల్లో జిల్లాలో ఓటింగ్ శాతం 76.86 నమోదు కాగా, ప్రస్తుతం 76.99 శాతం నమోదైంది.

సర్వే ఫలితాలపైనా ఆశలు

స్థానిక నాయకులు, కార్యకర్తలు, ముఖ్య అనుచరుల నుంచి సేకరించిన సమాచారమే కాకుండా పలు సంస్థలు చేసిన సర్వే ఫలితాలపై పలువురు అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. సర్వే సంస్థలు, ఛానళ్లు ప్రకటించిన సర్వేలన్నీ దాదాపుగా కాంగ్రెస్ పార్టీకే మొగ్గు చూపాయి. ఆయా సంస్థల సర్వే ప్రకారం కాంగ్రెస్ ఆధిక్యంలో ఉంటుందని ప్రకటించడంతో ఆ పార్టీ అభ్యర్థులు గెలుస్తామనే విశ్వాసంతో ఉన్నారు. అదే విధంగా ఓటింగ్ శాతం గతం కంటే పెరిగితే ఆ ఓట్లు ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమని, పెరిగిన ఓట్ల శాతం తమకు లాభం చేకూరుస్తుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్‌లో ఏకంగా 81.99 శాతం నమోదవడంపై కూడా చర్చ జరుగుతోంది. దీంతో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థులు తమ నాయకులు, అనుచరుల వద్ద ఇదే విషయాన్ని ప్రస్తావించినట్లు సమాచారం.

గెలుస్తామంటూనే గుబులు

ఓ వైపు అభ్యర్థులు తామే గెలుస్తామని పైపైకి ధీమా వ్యక్తం చేస్తున్నా లోలోపల మాత్రం గుబులు చెందుతున్నట్లు తెలిసింది. నాయకులు, కార్యకర్తలు, అనుచరులకు మనమే గెలుస్తామని ధైర్యం చెబుతూనే ఇతర మార్గాల ద్వారా పోలింగ్ సరళిని తెలుసుకుంటున్నారు. జిల్లాలోని పలు సెగ్మెంట్లలో కొందరు అభ్యర్థులకు తమపార్టీ నాయకులు ఇచ్చిన సమాచారానికి, ఇతర వ్యక్తులు, మార్గాల ద్వారా తెలుసుకుంటున్న సరళికి పొంతన కుదరకపోవడంతో ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా అభ్యర్థులు ఓటింగ్ సరళిపై రోజంతా లెక్కలు వేసుకుంటూ గడిపినట్లు సమాచారం. ఇదిలా ఉండగా పార్టీలు, అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా బెట్టింగులు సాగుతున్నట్లు సమాచారం.

కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంలు

పరిగి: గురువారం పోలింగ్ ప్రక్రియ ముగియడంతో శుక్రవారం పరిగి మార్కెట్ యార్డులోని కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంలను తరలించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో పరిగి, కొడంగల్, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచి స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా ఎవ్వరినీ లోపలికి అనుమతించరాదన్నారు. ఈ నెల 3వ తేదీ ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు ఆకాశ్, సుధాకర్, ఆర్‌ఓలు రాహుల్ శర్మ, విజయకుమారి, శ్రీనివాస్‌రావు, లింగ్యా నాయక్ తదతరులు పాల్గొన్నారు.

ఓటర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రా.జె.	మొత్తం ఓటర్లు
పరిగి	1,31,163	1,28,250	9	2,59,422
వికారాబాద్	1,13,919	1,14,321	13	2,28,253
తాండూరు	1,15,143	1,20,927	6	2,36,076
కొడంగల్	1,17,303	1,19,310	12	2,36,625
మొత్తం	4,77,528	4,82,808	40	9,60,376

పోలైన ఓట్లు

పురుషులు	మహిళల	ట్రా.జె.	మొత్తం	శాతం
1,00,519	9,8,466	1	1,98,986	76.70
8,7,026	8,5,454	6	1,72,486	75.57
8,6,038	8,7,663	1	1,74,002	73.71
9,6,403	9,7,537	00	1,93,940	81.96
3,69,986	3,69,420	08	7,39,414	76.99



తగ్గిన పోలింగ్ శాతం

- గత ఎన్నికలతో పోలిస్తే పెరిగిన ఓటర్ల సంఖ్య
- 73.71 శాతం పోలింగ్ నమోదు
- ఓటింగ్‌కు దూరంగా 62,074 మంది
- పురుషుల కంటే అధికంగా ఓటేసిన మహిళలు
- 2018తో పోలిస్తే 3.25 శాతం తగ్గుముఖం

తాండూరు: తాండూరు అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం స్వల్పంగా పడిపోయింది. 2018 ఎన్నికలతో పోలిస్తే ఈ సారి ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. కానీ పోలింగ్ మాత్రం 3.25 శాతం తగ్గింది. ఈ సారి అభ్యర్థుల గెలుపును మహిళ ఓటర్లే శాశించనున్నట్లు తెలుస్తోంది. పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటు వేసి తమ సత్తా చాటారు. తాండూరు అసెంబ్లీ పరిధిలో ఉమ్మడి పెద్దేముల్ మండలంతో పాటు, తాండూరు, బషీరాబాద్, యాలాల, తాండూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. 2,36,076 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,15,143 మంది, మహిళా ఓటర్లు 1,20,927 మంది ఉన్నారు. అయితే 1,74,002 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 62,074 మంది ఓటు వేయలేదు. 86,038 మంది పురుషులు, 87,963 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 73.71శాతం పోలింగ్ నమోదైంది. తాండూరు అసెంబ్లీ అభ్యర్థి గెలుపోటములు మహిళా ఓటర్లపైనే ఆధారపడి ఉంది. పురుషుల కంటే 1,925 మంది మహిళలు అధికంగా వేయడం అందుకు ప్రధాన కారణంగా నిలుస్తోంది.

ఓటు వేయని 62,074 మంది

2018 తాండూరు అసెంబ్లీ ఎన్నికల్లో 2,01,888 మంది ఓటర్లు ఉండగా 76.96 శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుత ఎన్నికల్లో కొత్తగా 34,188 మంది ఓటర్లు పెరిగారు. దీంతో పోలింగ్ శాతం భారీగా పెరుగుతోందని అధికారులు అంచనా వేశారు. కానీ ఈ సారి 73.71 శాతం మాత్రమే నమోదైంది. 62,074 మంది ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

రేవంత్‌రెడ్డిని కలిసిన నేతలు



రేవంత్‌రెడ్డితో టీఆర్ఆర్



రేవంత్‌రెడ్డితో ప్రసాద్‌కుమార్ తదితరులు

పరిగి: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల తీరుపై రేవంత్‌రెడ్డి ఆరా తీసినట్లు తెలిసింది. ఓటింగ్ సరళి ఎలా ఉంది.. ఎలాంటి ఫలితాలు వస్తాయనే విషయాలు చర్చించినట్లు చెప్పారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అందుకు ముందుగానే శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రసాద్‌కుమార్

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అభ్యర్థి, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల తీరుపై చర్చించినట్లు తెలిసింది.



భారీ భద్రత మధ్య..


రేపు ఓట్ల లెక్కింపు

- నగరంలో పలు ఆంక్షలు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్
- మద్యం దుకాణాలు బంద్

సాక్షి, సిటీబ్యూరో: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆదివారం కౌంటింగ్ కేంద్రాల వద్ద ఆంక్షలు విధిస్తూ శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య ఉత్తర్వులు జారీ చేశారు. 3వ తేదీ ఉదయం 6 నుంచి 4వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. నిషేధిత కర్రలు, లాఠీలు, పేలుడు పదార్థాలు, ఆయుధాలతో సంచరించడం నిషేధమని, సంఖ్యలో గుంపులుగా ఐదుగురి కంటే ఎక్కువగా తిరగకూడదని, మైక్‌లు, మ్యూజిక్ సిస్టమ్, ప్రసంగాలు చేయడం, నిషేధిత ఫొటోలు, సింబల్స్, ప్లకార్డులు, కులమత ద్వేషాలను రెచ్చగొడుతూ రెండు వర్గాల మధ్య గొడవలు సృష్టించే ప్రసంగాలు చేయడంపై నిషేధాలు విధించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసు, మిలిటరీ, ఎన్నికల అధికారులకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాలలో టపాసులు కాల్చడంపై నిషేధం విధించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆదివారం మద్యం దుకాణాలను మూసివేయాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు.



లిక్కర్.. నయా సాల్!



- గ్రేటర్‌లో 615 వైన్ షాపులకు అనుమతులు
- ఎన్నికల దృష్ట్యా ముందస్తుగానే లైసెన్సులు

కొలువుదీరిన కొత్త మద్యం దుకాణాలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో కొత్త మద్యం దుకాణాలకు ఆబ్కారీ శాఖ అనుమతులు ఇచ్చింది. శుక్రవారం కొత్త దుకాణాలు ప్రారంభమయ్యాయి. గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో కొత్తగా 615 వైన్స్ షాపులకు ఎక్సైజ్ శాఖ గత ఆగస్టులో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల దృష్ట్యా ముందస్తుగానే నోటిఫికేషన్ వెలువడటంతో వ్యాపారుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. అనేక చోట్ల పెద్ద ఎత్తున పోటీకి దిగారు. ఒక్కో మద్యం దుకాణానికి ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున ఫీజు విధించింది. ఒక వ్యాపారి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉండడంతో భారీ సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. శంషాబాద్ ఎక్సైజ్ జిల్లా పరిధిలో కేవలం 100 దుకాణాలకు 9,080 మంది పోటీపడ్డారు. సరూర్‌నగర్‌లో 134 దుకాణాలకు 9012 దరఖాస్తులు వచ్చాయి.

రూ.650 కోట్ల ఆదాయం..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 615 దుకాణాలపై లైసెన్సు ఫీజుల రూపంలోనే ప్రభుత్వానికి ఏకంగా రూ.650 కోట్ల వరకు ఆదాయం లభించినట్లు అంచనా. నగరంలోని దుకాణాల కంటే శివారు ప్రాంతాల్లోని మద్యం షాపుల కోసమే వ్యాపారులు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. మీర్‌పేట్, బడంగ్‌పేట్, శంషాబాద్, శేర్‌లింగంపల్లి, ఉప్పల్, మేడిపల్లి, కీసర, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లో భారీ డిమాండ్ కనిపించింది. ఆగస్టులో 16వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. అదే నెల చివరిలో డ్రా తీశారు. నిబంధనల మేరకు కొత్త వైన్ షాపులకు లైసెన్సుల ప్రక్రియ చేపట్టారు.

మూడు నెలల ముందే అనుమతి..

సాధారణంగా ప్రతి రెండేళ్లకోసారి మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్సులను అందజేస్తోంది. ఒకసారి లైసెన్సు పొందిన వ్యాపారి రెండేళ్ల పాటు దుకాణం నిర్వహించవచ్చు. రెండేళ్లకోసారి అక్టోబర్ నెలాఖరులో నోటిఫికేషన్ విడుదల చేసి నవంబర్‌లో అనుమతులను ఇస్తారు. అదే నెలలో మొత్తం ఫీజులో నాలుగో వంతు చెల్లించిన వారికి డిసెంబర్ ఒకటో తేదీ నాటికి దుకాణాలకు లిక్కర్ చేరుతుంది. కాగా.. ఈ ఏడాది ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆగస్టులోనే ఈ ప్రక్రియను చేపట్టడంతో సెప్టెంబర్‌లో ఫీజులు చెల్లించిన వ్యాపారులు కొత్త దుకాణాలను ప్రారంభించేందుకు డిసెంబర్ వరకు ఆగాల్సి వచ్చింది. రూ.లక్షల్లో ఫీజులు చెల్లించడం వల్ల ఈ మూడు నెలల పాటు భారీ మొత్తంలో వడ్డీ చెల్లించాల్సివచ్చిందని పలువురు విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు అన్ని కొత్త షాపులకు నవంబర్ 30 నాటికే మద్యం చేరాల్సి ఉండగా.. ఎన్నికల దృష్ట్యా డిసెంబర్ ఒకటో తేదీ శుక్రవారం ఉదయం నుంచే మద్యం సరఫరా కావడంతో కొన్ని చోట్ల సాయంత్రం వరకు కొత్త వైన్ షాపులు తెరుచుకున్నాయి.

మీ సేవలు అపురూపం



సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం, పక్షపాతం చూపించిన వారిపై వేటు వేసిన నగర కొత్వాల్ సందీప్ శాండిల్య.. ఉత్తమ పని తీరు కనబరిచిన వారిని గుర్తించి అభినందించారు. గురువారం పోలింగ్ నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు తమవంతుగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని శుక్రవారం ఆయన అభినందించారు. షాహినాయత్‌గంజ్ ఠాణా సరిహద్దు ప్రాంతంలో కొందరు రాజకీయ పార్టీలకు చెందిన పురుషులు, మహిళలు గొడవలు పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మంగళ్‌హాట్ ఠాణా ఎస్సై జి.అంబిక గుర్తించారు. తక్షణం అప్రమత్తమైన ఈమె షాహినాయత్ గంజ్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు వచ్చిన సిబ్బందితో కలిసి ఆమె కూడా గుంపును చెదరగొట్టారు. హబీబ్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని పోలింగ్ బూత్‌లో బోగస్ ఓట్లు వేయడానికి వచ్చిన కొంత మందిని నిలువరించి, వారిని సంబంధిత ఠాణాకు అప్పగించి కేసు నమోదు చేయించడంలో సిటీ సెక్యూరిటీ వింగ్ కానిస్టేబుల్ వినయ్ కుమార్ కీలకపాత్ర పోషించారు. ఫలక్‌నుమా ఠాణా మహిళా కానిస్టేబుల్ కృష్ణకుమారి భోంస్లే కాలాపత్తర్ పరిధిలోని పోలింగ్ బూత్‌లో విధులు నిర్వర్తించారు. అక్కడ బోగస్ ఓట్లు వేయడానికి వచ్చిన కొందరు వ్యక్తుల్ని అడ్డుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ ముగ్గురినీ శుక్రవారం ఐసీసీసీలోని కమిషనరేట్‌కు పిలిపించిన కొత్వాల్ సందీప్ శాండిల్య అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో అదనపు సీపీ (శాంతిభద్రతలు) విక్రమ్ సింగ్ మాన్, సంయుక్త సీపీ (ఎస్బీ) పి.విశ్వ ప్రసాద్ సైతం పాల్గొన్నారు.

క్లుప్తంగా

'జీవీకే'కు కోవిడ్ వారియర్ అవార్డు

తాండూరు టౌన్: కోవిడ్ సమయంలో అత్యవసర సేవలు అందించిన జీవీకే ఎంటర్‌ప్రైజెస్ (ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్)కు కోవిడ్–19 వారియర్ అవార్డు దక్కింది. ఈమేరకు గురువారం జపాన్‌లో జరిగిన 6వ ఈఎంఎస్ ఆసియా టోక్యో కాన్ఫరెన్స్‌లో ఈఎంఎస్ రంగంలో సంస్థాగత వర్గం కింద ఈ అవార్డును జీవీకే ఎంటర్‌ప్రైజ్ అందుకుంది. జీవీకే సంస్థ.. అంబులెన్స్‌ల ద్వారా కోవిడ్ సమయంలో 25.3 లక్షల మందికి సేవలందించింది. దీంతో భారత ప్రభుత్వం అంబులెన్స్ ఈఎంటీ, పైలట్‌లను ఫ్రంట్‌లైన్ కార్మికులుగా గుర్తించింది. అత్యుత్తమ సేవలందించిన తమ సంస్థకు అవార్డు దక్కడం గర్వనీయమని 108, 102 జిల్లా కోఆర్డినేటర్ విజ్ఞేశ్వర్ తెలిపారు.

ఆ ఓటర్లు.. ఎవరివైపో?

- ఇబ్రహీంపట్నంలో పెరిగిన పోలింగ్
- గత ఎన్నికల కంటే 48,608 ఓట్లు అధికం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 2018 శాసనసభ ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. 2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో 2,57,771 ఓటర్లు ఉండగా 1,96,851 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అప్పట్లో బీఎస్పీ నుంచి పోటీచేసిన ఇప్పటి కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిపై టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 356 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అయితే ఈసారి ఎన్నికల్లో(2023) నియోజకవర్గంలో కొత్తగా చేరిన వారితో ఓటర్ల సంఖ్య 3,27,583కు చేరింది. అందులో 2,45,459 మంది ఈ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి 48,608 ఓట్లు అధికంగా పోలయ్యాయి. అప్పట్లో బీఎస్పీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి కేవలం 356 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి చెందారు. అయితే ఈ ఎన్నికల్లో పోలింగ్ పెరగడంతో ఫలితం ఏవిధంగా ఉంటుందో అని అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. పెరిగిన ఓటర్లతో ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే అంచనాల్లో ఆయా పార్టీల శ్రేణులున్నారు. ఆదివారం జరిగే ఓట్ల లెక్కింపులో పెరిగిన ఓటర్లు ఎవరివైపు మొగ్గుచూపారో తేలనుంది.

సీఐ రఘువీర్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

డీజీపీకి ఏఆర్ కానిస్టేబుళ్ల ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల విధుల్లో భాగంగా ఏఆర్ కానిస్టేబుల్ యాదగిరిపై లాఠీతో దాడిచేసిన ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అతడి తోటి ఏఆర్ కానిస్టేబుళ్లు గురువారం డీజీపీకి ఫిర్యాదు చేశారు. డిసెంబర్ 30న జరిగిన మహేశ్వరం నియోజకవర్గంలోని పోలింగ్‌లో భాగంగా నాదర్‌గుల్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములకు గన్‌మెన్‌గా ఉన్న యాదగిరిపై దాడి చేయడంతో పాటు అవమానపర్చిన ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీ, మానవ హక్కుల సంఘం, చీఫ్ ఎన్నికల అధికారులకు తెలంగాణ పోలీస్ కానిస్టేబుల్స్ ఫిర్యాదు చేశారు. రాష్ట్ర పోలీసుల పరువు, ప్రతిష్టకు భంగం కలిగించడమే కాకుండా విధి నిర్వహణలో ఉన్న యాదగిరిపై అకారణంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.

శభాష్ రామకృష్ణారెడ్డి

మత్తు వైద్యుల సంఘం జాతీయకార్యవర్గ సభ్యుడిగా ఎన్నిక



చేవెళ్ల: మండల కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో మెడికల్ సూపరింటెండెంట్, అనస్తీషియా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి భారతీయ మత్తు వైద్యుల సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన మత్తు వైద్యుల సంఘం జాతీయ ఎన్నికల్లో తాను భారీ మెజార్టీతో గెలిచినట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో తనను జాతీయ ఎన్నికల్లో కార్యవర్గ సభ్యుడిగా గెలిపించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను గతంలో తెలంగాణ రాష్ట్ర స్టేట్ సెక్రటరీగా సేవలు అందించినట్లు తెలిపారు. మత్తు వైద్య సంఘం జాతీయ అవార్డును సైతం అందుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నానని ఇక్కడ ఈప్రాంత ప్రజలకు తనవవంతుగా వైద్య సేవలు అందిస్తానని చెప్పారు.

ఓటరు కటాక్షం ఎవరికో?

- పోలింగ్ సరళిపై సమాచారం సేకరిస్తున్న నేతలు
- వికారాబాద్‌లో కీలకంగా మారిన మైనార్టీ ఓట్లు
- తాండూరులో గెలుపుపై ధీమాగా ఉన్న ప్రధాన పార్టీలు



వికారాబాద్: పోలింగ్ బూత్ బయట క్యూలో ఓటర్లు (ఫైల్)

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ నియోజకవర్గ ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో తెలుసుకోవాటంలే మరో 24 గంటలు వేచి చూడాలి. అయితే గురువారం జరిగిన ఎన్నికల సరళిపై ఆయా రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ఆయా మండలాల్లో తమకు పడిన ఓట్లు, ఆధిక్యతపై బూత్‌స్థాయి నేతల వద్ద నుంచి సమాచారం సేకరిస్తున్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో 2,28,253 మంది ఓటర్లు ఉండగా గురువారం జరిగిన పోలింగ్‌లో 1,72,486 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 2018లో 1,50,192 ఓట్లు పోల్ కాగా.. 2023లో సుమారు 20వేల ఓట్లు ఎక్కువగా పోల్ అయ్యాయి. ఓటింగ్ శాతం పెరగడం అనేది ఎవరికి లాభం, ఎవరికి నష్టమనే విషయంపై ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు.

పట్టణ ఓట్లపై ప్రత్యేక చర్చ..

నియోజకవర్గంలో ఎక్కడ చూసినా.. జిల్లా కేంద్రంలోని ఓటర్లు ఎక్కడ మొగ్గ చూపారనే దానిపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. వికారాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 56,558 మంది ఓటర్లు ఉండగా గురువారం జరిగిన పోలింగ్‌లో 36,309 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. గత నాలుగైదు సాధారణ ఎన్నికలను పరిశీలిస్తే పట్టణ ఓటర్లు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారు. 2018లో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం సాధించినప్పటికీ వికారాబాద్ పట్టణంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ రెండు వేల ఓట్ల వరకు ఆధిక్యత సాధించింది. ప్రధాన పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఉండటంతో వీరిలో ప్రభుత్వ వ్యతిరేకత ఓటు ఎక్కువగా ఉంటుంది. గత సాంప్రదాయాన్ని తిరగరాస్తూ ఈసారి ఎన్నికల్లో ప్రధాన పట్టణంలో ఎక్కువ ఓట్లు సాధించబోతున్నామని బీఆర్‌ఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

శివారు ఓటర్లు ఎటువైపు..

ఇక పోతే మున్సిపాలిటీలో విలీనమై పట్టణానికి దూరంగా ఉన్న మద్గుల్ చిట్టంపల్లి, బూర్గుపల్లి, గుడుపల్లి, ధన్నారం, గెరిగెట్‌పల్లి, కొంపల్లిలో రెండు పార్టీలు ఓట్లను సాధించేందుకు తీవ్రంగా శ్రమించారు. ఇందులో ఒక మద్గుల్ చిట్టంపల్లి మినహా మిగత శివారు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ పెద్దగా ఓట్లు సాధించకపోవచ్చునని ప్రజలు చర్చించకుంటున్నారు. మున్సిపాలిటీలో విలీనమైనా ఇంకా గ్రామీణ వాతావరణమే ఉండటంతో ఓటర్లు కాంగ్రెస్ పథకాలకు ఎక్కువగా ఆకర్శితులైనట్లు ప్రచారం జరుగుతోంది. ఓటర్లు బయటకు చెప్పకపోయినా ఓటు మాత్రం చేతి గుర్తుకు వేశారనే ప్రచారం సాగుతుంది.

మైనార్టీ ఓట్లపై ఇరువురి ఆశలు...

వికారాబాద్ నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీ ఓట్లు సుమారు 24వేల వరకు ఉన్నాయి. గత సాంప్రదాయానికి భిన్నంగా ఈ ఎన్నికల్లో వారు భిన్నమైన నిర్ణయం తీసుకున్నారు. 40శాతం మంది బీఆర్‌ఎస్‌కు, మరో 40శాతం మంది కాంగ్రెస్‌కు బహిరంగరంగానే మద్దతు ప్రకటించి వారివారి అభ్యర్థుల తరఫున జోరుగా ప్రచారం నిర్వహించారు. మరో 20శాతం మైనార్టీలు ఎటువైపు కూడా మద్దతు ఇవ్వకుండా న్యూట్రల్‌గా ఉన్నారు. ఈ 20 శాతం ఓట్లు ఎటు పోలై ఉంటాయనే విషయం తెలియక ఇప్పుడు నేతలు తలలు పట్టుకుంటున్నారు.

తాండూరు కింగ్ ఎవరో?

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. తాండూరుకు సంబంధించి ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఎవరు గెలుస్తారనే విషయం స్థానిక నేతలకు అంతుచిక్కడం లేదు. తిరిగి సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి విజయం సాధిస్తారా? లేక డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి పాగా వేస్తారా? అనేది సర్వత్రా ఆసక్తిగా మారింది. గతంలో పోలింగ్ ముగిసిన వెంటనే తడుముకోకుండా ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారనేది వెంటనే స్పష్టంగా తెలిసేది. ఈసారి ఓటర్లు ఏ పార్టీ వైపు నిలిచారనేది తెలియక నేతలు తలలు పట్టుకుంటున్నారు. తాండూరు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఆ పార్టీల నేతలు పోలింగ్ సరళిపై కూడికలు, తీసివేతలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. పాత నేతకే పట్టం కడతారా.. లేక కొత్త నాయకుడికి అవకాశం కల్పిస్తారా అనే చర్చ కొనసాగుతోంది.

చాపకింద నీరులా బీఎస్పీ..

తాండూరు అసెంబ్లీ బీఎస్పీ అభ్యర్థిగా పెద్దేముల్ మండలానికి చెందిన చంద్రశేఖర్ ముదిరాజ్ బరిలోకి దిగారు.ప్రధానంగా బీఎస్పీ పార్టీ కాంగ్రెస్ ఓటు బ్యాంకును కొల్లగొడుతోందా.. లేకా బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకును చీల్చుతుందా అనేది చర్చనీయాంశమైంది.

కేడర్ లేని జనసేన..

బీజేపీ, జనసేన పార్టీలకు కుదిరిన పొత్తులో భాగంగా తాండూరు అసెంబ్లీ స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించారు. దీంతో హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన నేమూరి శంకర్‌గౌడ్ ఇక్కడనుంచి పోటీ చేశారు. అయితే తమ అభ్యర్థి నామినేషన్ వేసే రోజు తాండూరుకు వచ్చిన సేనాని స్థానికంగా సరిగా ఎన్నికల ప్రచారం చేయలేదంటూ విమర్శలున్నాయి. అలాగే పార్టీ కేడర్‌ను పటిష్ట పరుచుకోలేదు. ఆపార్టీకి ఏమేర ఓట్లు వస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రాణంమీదకు తెచ్చిన చేపలవేట

వలలో కాలు చిక్కుకుని వ్యక్తి మృతి



లక్ష్మయ్య (ఫైల్)

దోమ: బావిలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి అదేబావిలో పడి మృతి చెందిన సంఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని గుండాలకి చెందిన లక్ష్మయ్య(46) గురువారం రాత్రి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా గ్రామ సమీపంలో ఉన్న పెద్దబావిలో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పట్టేందుకు వల వేయగా.. అది అతడి కాళ్లకే చుట్టుకోవడంతో బావిలో పడి మునిగిపోయాడు. లక్ష్మయ్య కనిపించడం లేదంటూ శుక్రవారం ఉదయం అతడి భార్య మొగులమ్మ.. కుమారుడు, కుటుంబ సభ్యలకు చెప్పింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో చేపల వేటకే వెళ్లి ఉంటాడని గ్రామానికి సమీపంలో ఉన్న బావి దగ్గరకు వెళ్లి చూడగా.. బావి ప్రాంతంలో లక్ష్మయ్య దుస్తులు కనిపించగా.. అతడి శవం నీటిపై తేలియాడుతోంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘర్షణకు దారితీసిన భూవివాదం

- కారంపొడి, కర్రలతో ఇరువర్గాల పరస్పర దాడులు
- పలువురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- దోమ మండలం బుద్లాపూర్‌లో ఘటన



గాయాలైన వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

దోమ: భూవివాదం దాయాదుల మధ్య ఘర్షణకు దారితీసిన ఘటన దోమ మండల పరిధిలోని బుద్లాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మోతె హరిశంకర్, నర్సింహులు, శ్రీనివాస్, మల్లేశం, తిరుపతయ్య అన్నదమ్ముళ్ల కుమారులు. గ్రామంలోని సర్వే నంబర్ 16, 69, 309లో ఐదుగురికి కలిపి 7 ఎకరాల 04 గుంటల భూమి ఉంది. అయితే ఈ భూమి పంపకం విషయం కోర్టు పరిధిలో ఉండగా.. తరుచుగా వీరికి గొడవలు జరుగుతున్నాయి. భూవివాదం విషయమై గురువారం సాయంత్రం ఇరువురు గొడవకు దిగారు. తిరిగి శుక్రవారం మళ్లీ గొడవపడ్డారు. మోతె హరిశంకర్ అతని కుటుంబ సభ్యులు.. నర్సింహులు, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కారంపొడి, కర్రలతో విచక్షణారహితంగా పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇందులో మహిళలు సైతం దాడులు చేసుకోగా ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని 108 అంబులెన్స్‌లో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలను ఆరా తీశారు. దాడులకు పాల్పడ్డ ఇరువురి కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేశారు.

ఊరెళ్లలో పులి సంచారం పుకార్లు

- ఆందోళనలో చుట్టుపక్క గ్రామాల ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



ఊరెళ్ల–మొండివాగు సమీపంలో గుర్తించిన పాదముద్రలు

చేవెళ్ల: మండల పరిధిలో పులి సంచరిస్తోందని, ఓ వ్యక్తి చూశాడని సోషల్ మీడియాలో పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. ఇది నిజమా.. కాదా..? తెలియక మండల ప్రజలు అందోళన వ్యక్తంచేస్తున్నారు. ఊరెళ్ల అనుబంధ గ్రామమైన మొండివాగు సమీపంలో శుక్రవారం రోడ్డుపై పులి కనిపించిందని, కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తాను పులిని చూశానని మరో వ్యక్తికి వాట్సాప్‌లో వాయిస్ మెస్సేజ్ పెట్టాడు. పులి ఎన్కేపల్లి, కమ్మెట గ్రామాల వైపు వెళ్లిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మొండివాగు గ్రామ ప్రజలు పులి కనిపించినట్లు చెప్పిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ కనిపించిన పాద ముద్రలను చూసి.. పులివేనని ప్రచారం చేశారు. దీంతో అందరిలో భయం మొదలైంది. ఈ విషయమై కొంత మంది ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. వారు ఆయా ప్రాంతాలను పరిశీలించారని, ఇసుక దిబ్బలు, మట్టి రోడ్లపై కనిపించిన పాద ముద్రలను సేకరించారని తెలిపారు. కానీ అక్కడ సంచరించినది పులేనా.. కాదా..? అనేది నిర్ధారించలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు సమాచారం. దీంతో ఎన్కేపల్లి, కమ్మెట, ఊరేళ్ల, దేవునిఎర్రవల్లి, మొండివాగు తదితర గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. అధికారులు స్పందించి త్వరగా పక్కా సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

ఓటు.. గ్రేటు

- ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలో 80.93శాతం పోలింగ్
- సుదూరప్రాంతాల నుంచి వచ్చి ఓటువేసిన వలసకూలీలు



నాగిరెడ్డిపల్లిలో ఓటర్ల బారులు (ఫైల్)

బొంరాస్‌పేట: అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించి బొంరాస్‌పేట మండలంలో 80.93 శాతం పోలింగ్ నమోదైంది. ఉమ్మడి మండలంలో 54,173మంది ఓటర్లుండగా బొంరాస్‌పేట మండలంలో 30,908, దుద్యాల మండలంలో 23,265 ఓటర్లున్నారు. సాధారణంగా సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో ఎక్కువశాతం ఓటింగ్ నమోదవుతుంది. అయితే ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటువేసేందుకు సుదూర ప్రాంతాలకు వలస, ఉపాధి, ఉద్యోగం కోసం వెళ్లిన కుటుంబాలు భారీగా తరలివచ్చారు. దీంతో స్థానిక ఎన్నికల మాదిరి పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో ఇప్పటి ఎన్నికల పోలింగ్‌తో పోలిస్తే 2014లో 81.96శాతం అంటే దాదాపు ఒకశాతం ఎక్కువ పోలింగ్ నమోదైంది.

పెరిగిన కొత్త ఓటర్లు..

మరణం, వలస, ఉద్యోగ స్థానాల మార్పు వంటి తదితర కారణాల వల్ల ఓటర్ల సంఖ్య తగ్గుతుంది. కొత్త ఓటర్లు నమోదై జాబితాలోకి రావాలంటే మూడు లేదా ఐదేళ్ల సమయం పడుతుంది. 18ఏళ్లు నిండిన యువతీయువకులు ఈసారి చాలావరకు కొత్త ఓటర్లుగా నమోదయ్యారు. దీంతో మండలంలో ఓటర్ల సంఖ్య పెరిగింది. ప్రతి పోలింగ్ కేంద్రంలో కొత్త ఓటర్లపేర్లు ఉన్నాయి.

ఓటర్లు ఆలోచించాలి

ప్రజలకు ప్రాధాన్యాతనిచ్చే ప్రభుత్వాలు, నేతలు రావాలి. అలాంటి వారిని ఎన్నుకునేలా ఓటర్లు ఆలోచించాలి. తమప్రాంతాన్ని అభివృద్ధి చేసేవారినే ఓటర్లు ఎన్నుకోవాలి. అప్పుడే మార్పు సాధ్యమవుతుంది. – శ్రీలేఖ, బొంరాస్‌పేట

దూరమైనప్పటికీ వస్తాం



మాది గిరిజన కుటుంబం. మునుపటి నుంచి బొంబాయి, పూణే వలస వెళ్లి బతికేవాళ్లం. ఇప్పుడు కూడా అక్కడే బతుకుతున్నాం. కొన్ని సందర్భాల్లో పెళ్లిళ్లు, చావులు, పండుగలకు కూడా రానిరాలేని పరిస్థితులు. అయితే ప్రతిసారి ఓటుకు మాత్రం తప్పకుండా వస్తాం.

– రాధిక, సాలిండాపూర్‌తండా

గర్వంగా ఉంది



నాకు ఇటీవల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్ జరిగిన రోజు నుంచే ఎప్పుడెప్పుడు ఓటేద్దామా అని ఎదురుచూస్తున్నా. నవంబర్ 30 ఆరోజు రానేవచ్చింది. ఉదయాన్నే వెళ్లి ఓటువేశా. చాలా గర్వంగా ఉంది.

– అనుసూయ, బొంరాస్‌పేట

అవగాహన కల్పించాలి



నేను డిగ్రీ వరకు చదివాను. ఇటీవల ఓటుహక్కు వచ్చింది. ఓటరు జాబితాలో నాపేరు కనిపించేసరిగా ఆనందంగా అనిపించింది. ఎలా ఓటువేయాలో అధికారులు అవగాహన కల్పించలేదు. ఓటువేసే రోజు కాస్త భయపడినప్పటికీ నేను అనుకున్న అభ్యర్థికే ఓటువేశాను.

– అబూబకర్ సిద్దీక్, తుంకిమెట్ల

ఉద్యోగాలు కల్పించాలి



ఎన్నికల్లో డబ్బులు, మద్యం పంచుతున్నారు. వాటికి బానిసలు కాకుండా యువతకు విద్యా, ఉద్యోగాలు, పేదలకు వైద్యం అందించాలి. అలాంటి నేతలను ఎన్నుకుంటే మన ప్రాంతం బాగుపడుతుంది.

– జ్యోతి, నిరుద్యోగి, బురాన్‌పూర్

లారీని ఢీకొట్టిన బైక్

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయలయ్యాయి. వివరాలు.. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌తండాకు చెందిన బనావత్ రాజు బైక్‌పై వస్తుండగా కొంగరకలాన్ రోడ్డులో మినీలారీని వెనుకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజు తలకు గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. స్థానికులు అతడిని వెంటనే బ్యాంగి ఆస్పత్రికి తరలించారు.

టెన్షన్.. టెన్షన్

- ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- గెలుపుపై ధీమాగా ప్రధాన పార్టీల అభ్యర్థులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దశాబ్దాల కాలంగా రాజకీయాల్లో తలపండిన నాయకులే కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నుంచి ఇక్కడ మరోసారి బరిలో ఉండటంతో తీవ్ర ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. 2018 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ టికెట్ లభించని కారణంగా బీఎస్పీ నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి తలపడిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో మల్‌రెడ్డి రంగారెడ్డి కేవలం 356 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఈసారి కాంగ్రెస్ టికెట్ దక్కించుకున్న మల్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో ఢీఅంటేఢీ అనే రీతిలో బరిలో నిలిచారు. అయితే ఇప్పుడు పోలింగ్ ముగియడంతో ఎన్నికల ఫలితాలపై తీవ్రస్థాయిలో చర్చ కొనసాగుతోంది. ఎక్కడ ఎవరిని కలిసినా ఎన్నికల ఫలితాలపై మాట్లాడుకుంటున్నారు. కొంతమంది బీఆర్‌ఎస్ అంటుంటే మరికొంతమంది కాంగ్రెస్ గెలుస్తుందని అంటుండం చర్చనీయాంశంగా మారింది.

బయటకు ధీమాగా ఉన్నా...

ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపుపై బయటకు ధీమా వ్యక్తం చేస్తున్నా...లోలోపల ఓటర్లు ఎవరికి ఓటువేశారో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఈసారి తప్పక విజయం తమనే వరిస్తుందనే ధీమాతో మల్‌రెడ్డి రంగారెడ్డి ఉండగా.. బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తాను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తనను మరోసారి గెలపిస్తాయని ధీమాగా ఉన్నారు. పోలింగ్ సరళిపై ఇరు పార్టీల అభ్యర్థులు తర్జనభర్జనలు పడుతూ కాకి లెక్కలు వేసుకుంటున్నారు.

ఎవరి ఓట్లు చీల్చుతారో....

సీపీఎం, బీజేపీ అభ్యర్థులు ఎవరి ఓట్లు ఎక్కువగా చీల్చుతారో అర్థంకాకుండా ఉంది. నియోజకవర్గంలో సీపీఎం, బీజేపీలు సుమారు 15వేల నుంచి 18వేల వరకు ఓటు బ్యాంకు కలిగిఉన్నాయి. 2018లో బీజేపీ అభ్యర్థికి 17 వేల పైచిలుకు ఓట్లు రాగా.. సీపీఎం అభ్యర్థికి 10వేలకు పైగా ఓట్లు వచ్చాయి. అదేవిధంగా టీడీపీ నుంచి పోటీ చేసిన సామ రంగారెడ్డికి 18వేల పైచిలుకు ఓట్లు పడ్డాయి. ఈసారి ఎన్నికలకు టీడీపీ దూరంగా ఉండటం ఎవరికి కలిసోస్తుందో అంతుచిక్కకుండా ఉంది. వారి ఓట్లు ఏ వైపు, ఏ మేరకు దారి మరిలాయో అర్థంకాని పరిస్థితి. అయితే చాలావరకు బీజేపీ, సీపీఎం పార్టీలకు చెందిన వారు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు సమాచారం.

డబ్బుల ప్రభావం ఏ మేరకో..

ఇదిలాఉంటే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మునుపెన్నడూ లేనివిధంగా డబ్బుల ప్రభావం కనిపించింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఓటుకు ఇంత చొప్పున అని పంపిణీ చేసిన విషయం బహిరంగ రహస్యమే. ఈ డబ్బుల ప్రభావం అభ్యర్థుల గెలుపును ప్రభావితం చేస్తుందా లేదా అనే విషయాన్ని ఫలితాలు వస్తేగాని స్పష్టంగా బయటపడదు. ఏదిఏమైనా ఎన్నికల ఫలితాలను ముందుగా ఊహించి చెప్పడం ఇబ్బందిగా మారింది. ఆదివారం జరిగే ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల జాతకాలు బట్టబయలు కానున్నాయి. అంతవరకు ఓపిక పట్టాల్సిందే.

గప్‌చుప్

- పోలింగ్ ముగియడంతో గ్రామాల్లో నిశబ్ద వాతావరణం
- డబ్బు, మందు, బిర్యానీతో నెలరోజుల పాటు సందడి
- వ్యవసాయ పనులను కాదని ప్రచారంలో పాల్గొన్న మహిళలు
- పోలింగ్ అనంతరం నేతల ఫోన్లు స్విచ్చాఫ్



ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారి

యాచారం: నిన్నమొన్నటిదాకా ఎన్నికల హడావుడి, ప్రచారాల హోరుతో సందడిగా ఉన్న గ్రామాల్లో పోలింగ్ అనంతరం ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవహించింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దాదాపు నెలరోజుల పాటు గ్రామాల్లో సందడి నెలకొంది. వినాయక చవితి, దసరా పండుగలు ఎన్నికల సీజన్‌లోనే రావడం, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రజలను మచ్చిక చేసుకోవడం కోసం విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేశారు. వినాయక చవితి పండుగకు ఆయా గ్రామాల్లో యువజన సంఘాలకు రూ.లక్షల్లో ఖర్చు చేసి వినాయక విగ్రహాలను ఇప్పించారు. అడిగిన వారికి లేదనకుండా రూ.వేలల్లో చందాలు రాసారు. ఇదే అదునంటూ యువత ఆయా రాజకీయ నేతల నుంచి దండిగా డబ్బులు దండుకున్నారు.

రూ.కోట్లలో ఖర్చు..

ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, ఎల్బీనగర్, మహేశ్వరం, షాద్‌నగర్, చేవేళ్ల తదితర నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల నుంచి పోటీచేసిన అభ్యర్థులు పోలింగ్‌కు ముందు వరకు రూ.కోట్లల్లో ఖర్చు చేశారనేది బహిరంగ రహస్యం. దసరా పండుగ రోజైతే రూ.లక్షల్లో ఖర్చు చేసి విందులు ఏర్పాటు చేసి ఓటర్లను మచ్చిక చేసేందుకు యత్నించారు. ఎన్నికల సీజన్ కావడంతో పోటీలో నిలిచిన అభ్యర్థులు కూడా గ్రామాల్లో ఎవరు దావత్‌లు అడిగినా కాదనకుండా.. మేకలు, గొర్రెలు, కోళ్ల మాంసంతో పాటు మద్యం దావత్‌లు ఇచ్చారు. గ్రామాల్లో పేరు, పలుకుబడి కలిగి మెజార్టీ ఓట్లను ప్రభావితం చేయగలిగే వ్యక్తులను మచ్చిక చేసుకోవడం కోసం బడా నేతలు వారిని ఉచితంగా తీర్థయాత్రలకు తీసుకెళ్లి తమ వైపు తిప్పుకున్నారు. రూ.లక్షల్లో ఖర్చుచేసి సకల మర్యాదలు చేశారు.

వ్యవసాయపనుల వైపే చూడని మహిళలు..

ఎన్నికల సీజన్‌లో గ్రామాల్లోని మహిళలు వ్యవసాయ పనుల వైపే చూడలేదు. గ్రామాల్లో నిత్యం రెండు, మూడు పార్టీలకు చెందిన పోటీ అభ్యర్థులు ప్రచారం నిర్వహించడంతో మహిళలు ప్రచారంలో పాల్గొనడానికి ఆసక్తి చూపారు. గ్రామాల్లో గంట, రెండుగంటల పాటు నిర్వహించే ప్రచారానికి రూ.300 నుంచి రూ.500 వరకు డబ్బులు ఇవ్వడంతో పాటు మద్యం, బిర్యానీ ప్యాకెట్లు పంచిపెట్టారు అభ్యర్థులు. దీంతో మహిళలు ఎన్నికల ప్రచారంలో రోజుకు రూ.వెయ్యికి పైగానే సంపాదించారు. మహిళలతో పాటు కొన్ని గ్రామాల్లో పురుషులు, వృద్ధులు, యువతీయువకులు కూడా ప్రచారంలో పాల్గొన్నారు.

తెల్లవారేసరికి అంతా గప్‌చుప్..

అయితే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన మరుసటి రోజు నుంచి గ్రామాల్లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. శుక్రవారం ఉదయం పలకరించే వారు లేక అయ్యో ఈ రోజు మద్యం లేదా.. ఇక ఇవ్వరా అంటూ అనుకోవడం జరిగింది. రోజూ తెల్లవారే సరికి ఫోన్లు చేసి వచ్చేయండి అంటూ పిలిచే నేతలు శుక్రవారం కనిపించకపోవడంతో ప్రచారంలో పాల్గొనేవారు ఉసూరుమన్నారు. ఆయా పార్టీల ప్రజాప్రతినిధులకు ఫోన్లు చేసినా స్పందన లేకపోవడంతో ఇకనుంచి ఎవరి పనుల్లో వారు నిమగ్నం కానున్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం

కడ్తాల్: రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించనుండం ఖాయమని రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ అన్నారు. 30న జరిగిన పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర ప్రజలు మద్దతుగా నిలిచారని, ఎగ్జిట్‌పోల్ సర్వేలన్నీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రకటించాయని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆసిఫ్ అలీ హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు.